క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో ప్రతిభ



మరికల్: తాయిక్వాండో రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. ఆదివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి శివకుమార్ కాంస్య పతకం సాధించాడు.

వీరశైవలింగాయత్ కమిటీ ఎన్నిక



ఊట్కూరు: మండల కేంద్రంలో వీరశైవలింగాయత్ బలిజ మండల కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రభులింగం, అధ్యక్షుడిగా హరిగిరి జగదీష్, ప్రధాన కార్యదర్శిగా కోరి పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కోరి బసంత్, కోశాధికారిగా సురేష్ లింగం తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

రేపు నాయీబ్రాహ్మణుల సమావేశం

మరికల్: నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించే నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆదివారం ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని సత్యానారాయణ దేవాలయం ఆవరణలో జరిగే సమావేశానికి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయీబ్రాహ్మణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైద్య పరీక్షలు

నారాయణపేట: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పాత బస్టాండ్ వద్ద ఉచితంగా మధుమేహ పరీక్ష క్యాంపును నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపుగా 150 మందిని పరీక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లిభి రఘు బాబు, మహేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



స్టేషన్ మహబూబ్‌నగర్ : స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ జి.కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రం అప్పన్నపల్లి కమ్యూనిటీహాల్‌లో పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం కరాటే, మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు. వీటిని నేర్చుకోవడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. ఇన్‌స్ట్రక్టర్ తిరుమలేష్, బ్లాక్ బెల్టు విద్యార్థులు నిశాంత్, అక్షర, నందిని, సాయి వర్షిని, అభినవ్, ఎస్.నందిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మహబూబ్‌నగర్ రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన కురువ సామాజిక వర్గం విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ మేరకు పదోతరగతి, ఇంటర్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విద్యార్థులు ప్రతిభ చూపడం సంతోషించదగ్గ విషయమని మదాసీ, మదారి కురువ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2023–24లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించినట్లు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములు ఆధ్వర్యంలో మెమెంటో, శాలువ, క్యాష్ ప్రైజ్ అందజేశారు. అదేవిధంగా ఇటీవల పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించారు. నాయకులు శివన్న, బాలయ్య, భరత్, బాబు, వేణుగోపాల్, సునీల్, మల్లేష్, మాధురి, మహేశ్వరమ్మ, గోకారి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏఓనే దిక్కు



అడవిసత్యారం రైతువేదికలో బీమా నమోదు చేసుకుంటున్న రైతులు (ఫైల్)

- రెగ్యులర్ అధికారి లేక రైతుల ఇక్కట్లు
- పూర్తిస్థాయిలో అందని సేవలు
- సమయపాలన పాటించని ఏఈఓలు



మాగనూర్‌లో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్(ఫైల్)

మాగనూర్: వానాకాలం, యాసంగి సీజన్‌లో ఏఏ పంటలు వేయాలి, రైతులకు సాగుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం రైతువేదికలు నిర్మించింది. ఏఓ(వ్యవసాయ అధికారి)లు వారికి సాగులో సలహాలు, సూచనలు చేసి వారి సందేహాలను నివృతి చేయాలి. అయితే మండలానికి రెగ్యులర్ ఏఓ నియమించకపోవడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కేవలం వ్యవసాయ విస్తీర్ణ అధికారుల(ఏఈఓ)తోనే సరిపెడుతున్నారు. రైతువేదికల్లో కొందరు అందుబాటులో ఉండకపోవడం, మరి కొందరు సమయపాలన పాటించడం లేదు.

రెండేళ్లుగా ఇన్‌చార్జినే..

మండలంలో రెండేళ్లుగా ఏఓ పోస్టు ఖాళీగా ఉంది. ఏడుగురు ఏఈవోలు విధులు ఉన్నారు. రెండేళ్లుగా ఇన్‌చార్జి ఏఓతో నెట్టుకొస్తున్నారు. కృష్ణ మండలం ఏఓ సుదర్శన్‌గౌడ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు రెండు మండలాలు కావడంతో అవసరమైన సమయంలో రాకపోవడంతో పూర్తి స్థాయిలో సేవలందడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్న ఏడుగురిలో కొందరు ఏఈవోలు క్లస్టర్‌లో అందుబాటులో ఉండడం లేదు. అప్పుడప్పుడు మండల కేంద్రంలోని రైతువేదికకు వచ్చి వెళ్తున్నారు. పంటల సాగు, రైతుబంధు విషయంపై ఏవో, ఏఈవోలకు ఫోన్ చేస్తే స్పందించడం లేదనే విమర్శలు వెలువెత్తున్నాయి.

అనుమతి లేకుండా మందుల విక్రయాలు

అధికారుల పర్యవేక్షణ కరువైన నేపథ్యంలో మండల వ్యాప్తంగా పురుగు మందుల దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. దీనికి గల కారణం బయో మందులు విక్రయించడంతో అధిక లాభాలు సొమ్ము చేసుకుంటున్నారని మండల రైతుల చెబుతున్నారు. అధికారులు ఎక్కడా కూడా బయో మందులను పట్టుకున్న దాఖలాలు లేవు. ఇందులో అనుమతులు ఉన్నాయి? లేనివి ఏంటనే అంశంపై స్పష్టత రావడం లేదు. ఇదే అదునుగా చూసుకుని కొన్ని మందుల దుకాణాల యజమానులు అధిక ధరలకు విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులు విక్రయిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఒకటి, రెండు షాపుల్లో తనిఖీ నిర్వహించి వదిలేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం..



ప్రస్తుతం మండలంలో రెగ్యులర్ ఏవో లేదు. అయితే త్వరలోనే కొత్త ఏవోను నియమిస్తాం. మండలంలో ఏఈవోలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా వారు రోజు చేసే పనులు మాకు యాప్‌ద్వారా చేరుతూనే ఉన్నాయి. బీమా నమోదు మండలంలో చురుకుగా జరుగుతుంది. ఏవైనా సమస్యలు ఉంటే తప్పకుండా పరిష్కరిస్తాం. – జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి, నారాయణపేట

తెరుచుకోని రైతువేదికలు

మండలంలో మొత్తం ఏడు క్లస్టర్లలో రైతువేదికలు ఉన్నాయి. వ్యవసాయ అధికారులు రైతువేదికలో అందుబాటులో ఉండి భూసారపరీక్షలు నిర్వహించి, ఎలాంటి పంటలు వేయాలి, తెగుళ్ల నివారణ చర్యల గురించి రైతులకు వివరించాలి. కొందరు అందుబాటులో లేకపోవడంతో రైతువేదికలు తెరుచుకోవడం లేదు. భూములు కొనుగోళ్లు చేసిన రైతులు రైతుబంధు, రైతుభరోసా పథకాల దరఖాస్తు చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

పాఠాలు చెప్పేవారేరి?

● పిల్లలు వస్తున్నారు.. పోతున్నారు ● నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి



ఖాళీ కుర్చీ ఎదుట కూర్చున్న విద్యార్థులు



జీబండాతండా ప్రాథమిక పాఠశాల

మరికల్: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ అనంతరం పాఠశాలకు ఉపాధ్యాయుడే లేకుండా పోయారు. మండలంలోని జిన్నారం పంచాయతీ పరిధిలోని జీబండ తండా ప్రభుత్వ పాఠశాల మూడేళ్ల పాటు పిల్లలు లేక మూతపడింది. అయితే రెండేళ్ల క్రితం అక్కడకు బదిలీపై వెళ్లిన రవీందర్‌నాయక్ 13 మంది పిల్లలను చేర్పించి పాఠశాలను చేర్పించారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టడంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రవీందర్‌నాయక్ ఊట్కూర్ మండలం కొత్తపల్లికి బదిలీ కాగా, ధన్వాడ మండలం మణిపూర్‌తండా పాఠశాల్లో పనిచేస్తున్న రాధికను జీబండ తండాకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయురాలు ఇంకా రిలీవ్ కాకపోవడంతో జీబండతండా పాఠశాలకు వస్తున్న విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గుతూ వస్తుంది. శనివారం కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే వచ్చారు. వీరికి విద్యా, బుద్దులు నేర్పేది ఎవరూ, మధ్యాహ్న భోజనం పెట్టేంది ఎవరూ? వీరి అతిగతి చూసేది ఎవరిని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మణిపూర్‌తండా పాఠశాల నుంచి బదిలీ అయిన రాధికను జీబండాతండాకు పాఠశాలకు రిలీవ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా ఇమామే మౌలాలి గంధోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని రాజ వీధిలోని మసీదులో ఏర్పాటు చేసిన కొడిపీర్ల ఉత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి, తెల్లవారుఝూమున ఇమామే మౌలాలి గంధోత్సవాన్ని గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి రాత్రి ఒంటి గంటకు పట్టణంలోని పురవీధుల వెంట భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ దంపతులు దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. అలాగే అలాయ్ బలాయ్ ఆడి భక్తిని చాటుకున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు హసనేఆలం, హుసేనీఆలం, ఇమామే ఖాసీం, ఇమామే జలాలీ పీర్లను భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారు. ఊరేగింపును చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. కొడిపీర్ల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికాదు'

కోస్గి: అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి ఏంఐఏం నేత అక్బరుద్దీన్ ఒవైసీని గెలిపించి ఉప ముఖ్యమంత్రిని చేస్తానని చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సరికాదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ వ్యతిరేకి అయిన అక్బరుద్దీన్ ఒవైసీని పోటీ చేయిస్తే ఇక్కడి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నరని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువు నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువా, పూలదండలు, జ్ఞాపికలతో సత్కరించారు.

బురదమయంగా రోడ్డు



కొల్లంపల్లి నుంచి సికరమోనితండాకు వెళ్లే రోడ్డు దుస్థితి

నారాయణపేట రూరల్: ఏళ్ల నుంచి రోడ్డు సౌకర్యం కావాలని వేడుకుంటున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఏటా వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నామని గిరిజనవాసులు వాపోతున్నారు. మండలంలోని కొల్లంపల్లి శివారులోని సికరమోనితండాకు వెళ్లాలన్నా, ఆ గ్రామ ప్రజలు ఇతర చోట్లకు రావాలన్నా ఈ బురదతో కూడిన రోడ్డుపై ప్రయాణం చేయాల్సిందే. నిత్యం పాఠశాలకు వెళ్లి వచ్చే విద్యార్థుల సమస్య వర్ణణాతీతం. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి చెప్పనక్కరలేదు. ఇప్పటికైన అధికారులు, పాలకులు కళ్లు తెరిచి తమ గోడును ఆలకించాలని, వెంటనే బీటీ రోడ్డు వేసి కష్టాల నుంచి గట్టెంక్కించాలని కోరుతున్నారు.

నిర్వహణ లేని పల్లెప్రకృతి వనం



పల్లెప్రకృతివనంలో పెరిగిన పిచ్చి మొక్కలు



మూసుకుపోయిన దారి

ధన్వాడ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం సరైన నిర్వహణ లేక పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఆడుకునే వస్తువులు విరిగిపోయి నిరుపయోగంగా మారుతుంది. ప్రస్తుతం పూల మొక్కలు ఎండిపోయాయి. గతంలో ఎన్ఆర్‌జీఎస్ నుంచి కూలీని ఏర్పాటు చేసి నిర్వహణ అప్పజెప్పారు. వంద రోజులు పూర్తయ్యిందని ఆయను తొలగించి పంచాయతీ సిబ్బందిని కేటాయించారు. పంచాయతీ పనులు అలాగే పల్లె ప్రకృతివనం పనులు నిర్వహణ ఇబ్బందిగా మారింది. చిన్నరులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బల్ల, ఊయ్యాల విరిగిపోయాయి. జిమ్ వస్తువులు నిరుపయోగంగా మారాయి.

ముగిసిన హజ్రత్‌ల ఉర్సు

అలరించిన ఖవ్వాలి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

ఆత్మకూర్: పట్టణంలో రెండురోజులుగా కొనసాగుతున్న హజ్రత్ సయ్యద్ షా సాహెబ్ రహ్మతుల్లా అలై, హజ్రత్ సయ్యద్ మౌలాన సాహెబ్ రహ్మతుల్లాఅలై ఉర్సు ఆదివారం ముగిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రముఖ గాయకులు గపూర్, అమర్ ఆధ్వర్యంలో ఖవ్వాలీ ఉత్సాహంగా కొనసాగింది. ఖత్మే ఖురాన్, ఫాతేహా, దీపారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. మధ్యాహ్నం దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం జమేదార్ వీధి యువకులు గలేఫ్, చాదర్‌ను వీధుల్లో ఊరేగించి దర్గాకు చేర్చారు.

పీఠాధిపతులు, ప్రముఖుల ప్రార్థనలు..

ఉర్సుకు వట్టెం షరీఫ్ పీఠాధిపతి ముర్షద్ ఖాజాబాబా, వకలందరి చిస్తీమీర్జాయి సాహెబ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఫాతేహా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవియాదవ్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కౌన్సిలర్లు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎక్బాల్‌బిన్ సయ్యద్, ఖమర్‌బిన్ సయ్యద్, బారిసాబ్, గయాసుద్దీన్, ఖలీల్, మినాజ్, మగ్బూల్, ఫయాజ్, హసీం, ఇబ్రహీం, రహ్మతుల్లా, సాదిఖ్, ఫిరోజ్, అజహర్, ఉబేద్, అజ్మతుల్లా, ఇస్మాయిల్, జుబేర్, రియాజ్, షోయబ్, ఖదీర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండగా, మరో వైపు జీవాలకు, ప్రజలకు ప్రాణసంకటంగా మారంది. మండలంలోని ఓబ్లాపూర్ సమీపంలో స్తంభాలు లేక కర్రల సాయంతో విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. వర్షాకాలం కావడంతో కొన్ని ప్రదేశాలలో విద్యుత్ స్తంభాలు నెలకొరిగి ఉన్నాయి. వీటిని పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ముందస్తుగా ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు. – మాగనూర్

ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



మక్తల్‌లో పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్: వినాయక విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని వీహెచ్‌పీ, హిందూవాహిని, ఏబీవీపీ, అఖిల భారత అయ్యప్ప కమిటీ, పలు ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపార దుకాణాలను బంద్ చేశారు. పలువురు మాట్లాడుతూ.. బురాన్‌గడ్డ వీధిలో ఈ నెల 14వ తేదీన రాత్రి వినాయక విగ్రహాలను ధ్వంసం చేయడం సరైందికాదన్నారు. మక్తల్ ఎప్పుడు ప్రశాంతమైన వాతావరణంలో ఉంటుందన్నారు. అనంతరం ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, అనిల్‌కుమార్, భీంరెడ్డి, నర్సింహ, కుర్మయ్య, వినయ్, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

వినాయక విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

నారాయణపేట: బజరంగ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ఆదివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, రఘువీర్‌యాదవ్, కేతన్ రఘునాథ్, నీలగిరి రావు కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

మక్తల్‌లో వినాయక విగ్రహాలను ధ్వంసం చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఆదివారం తెలిపారు. బురాన్‌గడ్డ వీధికి చెందిన ఆరుగురు మైనర్లు విగ్రహాలను ధ్వంసం చేశారని విచారణలో తేలిందన్నారు. విగ్రహాల తయారీ కేంద్రం వద్ద కొంతమంది ఆకతాయి పిల్లలు ఆడుకుంటూ ధ్వంసం చేశారన్నారు. రెండు ఫిర్యాదులు అందగా కేసు నమోదు చేశామన్నారు. మైనర్లను కోర్టులో హాజరుపరిచి జువైనల్ స్టేట్ హోమ్‌కు తరలించామన్నారు. ఇతరు మనోభావాలను దెబ్బతియకుండా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు.

పాఠశాల మరుగుదొడ్ల పనులకు ఆటంకం



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

మరికల్: మండలంలోని జీబండతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాఠశాల మరమ్మతుల నిమిత్తం గదులను మరమ్మతులు చేసిన అనంతరం శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లను తొలగించి ఆ స్థానంలో కొత్తవి నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పక్కనే ఉన్న కొందరు రైతులు ఈ స్థలం తమదంటూ పనులను అడ్డుకుంటున్నారు. పాఠశాల స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని పనులు జరిగేలా చూడాలని తండావాసులు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మరికల్: పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం చేపట్టిన ధర్నాకు సంబంధించిన చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు. ఏళ్ల తరబడి ఏబీసీడీ వర్గీకరణ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నో ఉద్యమాలు చేసినా తమ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో రామస్వామి, బాలకృష్ణ, నర్సింహులు, బుడ్డన్న, గోపాల్, కొండయ్య, రాజేష్, బాలయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా కోట మైసమ్మ బోనాలు



అమ్మవారి ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

కోస్గి: పట్టణంలోని మున్నూర్‌వీధి పాశంగేరిలో ఉన్న కోట మైసమ్మ బోనాల వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు, యువతులు ప్రత్యేకంగా అలంకరించిన మట్టి కుండల్లో అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు.